

రేపు జనసేనలో చేరనున్న ఆరణి

- పలువురు కార్పొరేటర్లు, సంఘాల మద్దతు
- వైసీపీని వీడేందుకు కారణాలు చెబుతూ నేడు మీడియా సమావేశం



చిత్తూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం జనసేన పార్టీలో చేరనున్నారు. పలువురు కార్పొరేటర్లతో పాటు భారీ ఎత్తున అనుచరులతో కలిసి జనసేనలోకి వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. తన వెంట ఎంత మందిని తీసుకెళతారన్నది సస్పెన్స్‌గా ఉంది. హైదరాబాదులో ఆదివారం జనసేనాని పవన్ కల్యాణ్‌ను కలిసి వచ్చినప్పటి నుంచి ఆయన్ను మద్దతుదారులు, జనసేన నాయకులు పెద్దఎత్తున కలుస్తున్నారు. 'నియోజకవర్గంలో వైసీపీ అభివృద్ధి కోసం ఏళ్లుగా కష్టపడ్డాను. ఐదేళ్లు ఎమ్మెల్యేగా నిజాయితీగా పనిచేశాను. అలాంటి నన్ను కాదని ఓ స్మగ్లర్‌కు టికెట్ ఇచ్చారు. రాజ్యసభ హామీని కూడా నిలబెట్టుకోలేదు. వైసీపీ నన్ను అడుగడుగునా అవమానించింది. అందుకే పార్టీ మారాల్సి వచ్చింది' అని తనను కలిసిన వారందరితోనూ ఎమ్మెల్యే శ్రీనివాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చిత్తూరులో వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డిని ఓడించి, టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను గెలిపించాలన్నదే తన ముందున్న లక్ష్యంగా తన వర్గీయులకు చెప్పి.. వారిని సమాయత్తం చేస్తున్నట్లు సమాచారం. ఇక, వైసీపీ అధిష్ఠానం తనకు చేసిన అన్యాయాన్ని, జరిగిన అవమానాన్ని వివరిస్తూ బుధవారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించనున్నారు. కాగా, జనసేన తరపున తిరుపతి టికెట్‌ను కేటాయించాలని పవన్‌ను ఆరణి కోరినట్లు తెలిసింది. టీడీపీ- జనసేన పొత్తులో భాగంగా ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లు జనసేనకు కేటాయించాల్సి వస్తుంది.ఆ జాబితాలో తిరుపతి కూడా ఉంది.ఇటీవల ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో తిరుపతి ప్రస్తావన లేదు. దీంతో ఆయన తిరుపతి మీద దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత, తిరుపతిలో సామాజికవర్గ బలం, టీడీపీ- జనసేనకు ఉన్న సానుకూలత.. తన విజయానికి సులువు అవుతాయనే ఆలోచనలో ఉన్నట్లు చెబుతున్నారు.

చట్టసభల్లోకి సమర్థులను పంపండి

- ఓటర్లకు సిటిజన్ ఫర్ డెమోక్రసీ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

చిత్తూరు, మార్చి 5: ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా చట్ట సభల్లోకి సమర్థులను పంపాలని సిటిజన్ ఫర్ డెమోక్రసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లక్ష్మణరెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరులో మంగళవారం నిర్వహించిన కళాజాత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు ఆవశ్యకత, ప్రజాస్వామ్యం విలువలను తెలియజేస్తూ కళాకారులు ప్రదర్శించిన కళాజాత ఆహూతులను అలరించింది. ప్రజాస్వామ్యాన్ని రక్షించేలా, నైతిక విలువలకు పట్టం కట్టేలా రానున్న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు ద్వారా ప్రతిస్పందించాలని జిల్లా అరసం అధ్యక్షుడు గంటా మోహన్ సూచించారు. జిల్లా జానపద సంఘాల అధ్యక్షుడు ఆనంద నాయుడు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వాదులు, యువఓటర్లు ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి అరుణకుమారి, వాసుదేవ నాయుడు, రాజేష్, సహదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈ మూడు నెలలు బాధ్యతతో పనిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 5: నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు ఈ మూడు నెలలు అధికారులందరూ బాధ్యతతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణపై రెండో రోజైన మంగళవారం చిత్తూరులోని జడ్పీ మీటింగ్ హాలులో అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో జిల్లా ఉన్నందున ఎన్నికల్లో ప్రత్యేక దృష్టి ఉంటుందని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వస్తుందన్నారు. నాటి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో ఎన్నికల సమావేశాలు నిర్వహించాలంటే ఆయా పార్టీలు స్థానిక డీఎస్పీ నుంచి అనుమతి పొందాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నాయకుల ఫొటోలు, ప్రభుత్వ కార్యక్రమాల ఫొటోలు, బ్యానర్లు తొలగించాలని చెప్పారు. ఎక్కడైనా సంఘటనలు జరిగితే వంద నిమిషాల వ్యవధిలో సంబంధిత బృందం దానిని పరిశీలించి నివేదిక పంపాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే బృందం పూర్తిగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని పోలీసు యంత్రాంగం కల్పిస్తుందని ఎస్పీ జాషువా చెప్పారు. విశ్రాంత అదనపు జేసీ వీఆర్ చంద్రమౌళి, ఎస్ఎస్ఏ పీవో వెంకటరమణారెడ్డి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో బి. పుల్లయ్య, డ్వామా పీడీ ఎస్.ఎన్. రాజశేఖర్, పోలీసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా, తొలిరోజు శిక్షణకు గైర్హాజరైన ఎనిమిది మందికి కలెక్టర్ షన్మోహన్ షోకాజ్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. తాము టెట్, ఇంటర్ పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న దృష్ట్యా రాలేకపోయామని వారు సమాధానాలిచ్చారు.

సరిహద్దు చెక్‌పోస్టు వద్ద 4 కిలోల బంగారం పట్టివేత

నగరి, మార్చి 5: నగరి మండలం తడుకుపేటలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఉదయం నాలుగు కిలోల బంగారం పట్టుకున్నట్లు సీఐ సురేష్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో తమిళనాడు సరిహద్దున ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రోజువారీ వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో చెన్నై నుంచి తిరుపతికి వెళుతున్న ఓ వాహనంలో బంగారం పట్టుబడినట్లు సీఐ చెప్పారు. బంగారాన్ని సీజ్‌చేసి పోలీసుల అదుపులో ఉంచినట్లు తెలిపారు. ఓ నగల దుకాణం వారికి చెందినట్లుగా బిల్లులు ఉన్నాయని, కానీ లీగల్ తనిఖీకి బుధవారం పంపిస్తామన్నారు. కరెక్టుగా బిల్లుల ప్రకారం ఉందని తేలితే వారికి బంగారాన్ని అప్పగిస్తామన్నారు.

వి.కోటలో పోలీసుల వీరంగం



→ తెలుగుదేశం వారిపై లాఠీఛార్జ్ చేస్తున్న పోలీసులు

- పుష్పపల్లకి సేవ కవరేజ్‌కు వెళ్లకుండా మీడియా ప్రతినిధుల అడ్డగింత
- ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తను చితకబాదిన పెద్దపంజాణి ఎస్‌ఐ
- ధర్నాకు దిగిన తెలుగుదేశం శ్రేణులపై లాఠీచార్జి
- మీడియా ప్రతినిధులతో పాటు టీడీపీ వారిపైనా కేసులు
- వి.కోటలో నాలుగు గంటల పాటు ఉద్రిక్తత

వి.కోట, మార్చి 5: వి.కోటలో సోమవారం రాత్రి జరిగిన వీరాంజనేయస్వామి పుష్ప పల్లకి సేవ సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం చూపారు. ఎస్‌ఐ వీరంగం.. తీవ్ర విమర్శలకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. పల్లకి సేవ కవరేజ్‌కు వెళుతున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకరి జగన్ ద్విచక్ర వాహనాన్ని అనుమతించలేదు. కవరేజ్‌కు వెళ్లాలని అడగ్గా.. బందోబస్తు విధులో ఉన్న పెద్దపంజాణి ఎస్‌ఐ శ్రీనివాసులు అసభ్యపదజాలంతో దూషించారు. అక్కడే ఉన్న వివిధ ఛానళ్ల ప్రతినిధులు ఎస్‌ఐ తీరును తప్పుపట్టారు. అక్కడకు చేరుకున్న కొందరు మీడియాపట్ల పోలీసుల తీరు సరికాదని వాదనకు దిగారు. పోలీసుల తీరును తప్పుపట్టిన వారిలో తుపాకిచిన్నేపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త చెంగప్ప అనే బాబు కూడా ఉన్నారు. అతడిని ఎస్‌ఐ, సిబ్బంది బూటు కాళ్లతో తన్ని, పోలీసు స్టేషన్‌కు తరలించారు. అతడిని విడిచిపెట్టాలని మీడియా ప్రతినిధులు నిరసనకు దిగడంతో స్టేషన్ నుంచి వదిలేశారు. పోలీసుల దెబ్బలకు అతడి చెవిలో రక్తస్రావం కావడం.. రెండు చెవులూ వినిపించక పోవడంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమ కార్యకర్తను పోలీసులు చావబాదారన్న విషయం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు. ఆపై ఎన్టీఆర్ కూడలిలో పోలీసుల తీరును నిరసిస్తూ ధర్నాకు దిగారు. అకారణంగా తమ కార్యకర్తను చితకబాదిన ఎస్‌ఐ క్షమాపణ చెప్పే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించారు. టీడీపీ నేతలకు సర్దిచెప్పేందుకు సీఐ లింగప్ప ప్రయత్నించగా.. ఎస్‌ఐ క్షమాపణ చెప్పాలంటూ వారు పట్టుబట్టారు. వీరాంజనేయస్వామి పుష్ప పల్లకి ఎన్టీఆర్ కూడలికి చేరుకున్నా వీరు ధర్నా విరమించలేదు. దీంతో పోలీసులు టీడీపీ శ్రేణులపై లాఠీ ఝుళిపించారు. ఈ క్రమంలో పోలీసులు, టీడీపీ వారి మధ్య తోపులాట జరిగింది. తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కొందరు నేతలు గాయపడ్డారు. చివరకు టీడీపీ నేతలు ధర్నా విరమించి పక్కకు తప్పుకోవడంతో పల్లకి ముందుకు సాగింది. ఆ సమయంలో కొందరు వైసీపీ శ్రేణులు జై జగన్ అంటూ కేకలు వేయడంతో మరోసారి ఉద్రిక్తంగా మారింది. 57 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పలమనేరు వైసీపీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పల్లకిలో డ్రైవర్‌గా వాహనాన్ని నడిపారు.



ఎన్టీఆర్ కూడలిలో ధర్నా చేస్తున్న టీడీపీ శ్రేణులు



గాయపడిన సోమశేఖర్

విలేకరులు, టీడీపీ నేతలపై రెండు కేసులు

- వి.కోట పుష్ప పల్లకి సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై పోలీసులు విలేకరులు, టీడీపీ నేతలపై రెండు కేసులు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కల్పించారంటూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకరి జగన్‌మోహన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సునీల్, రోషన్, అశోక్‌తో పాటు పోలీసుల చేతిలో దెబ్బలుతిన్న చెంగప్ప అలియాస్ బాబు సహా ఐదుగురిపై కేసు పెట్టారు.
- పుష్పపల్లకీ వస్తున్నా ఎన్టీఆర్ కూడలి వద్ద గుంపుగా చేరి ఆందోళనకు దిగారంటూ మండల టీడీపీ అధ్యక్షుడు రంగనాథ్, మాజీ మండల పార్టీ కార్యదర్శి సోమశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ధీరజ్‌తో పాటు 26 మందిపైన.. ఇక్కడా నలుగురు విలేకరులను నిందితులుగా చేర్చి మొత్తం 30 మందిపై మరో కేసు నమోదైంది. కాగా, జర్నలిస్టులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలంటూ అంబేడ్కర్ కూడలిలో మంగళవారం రాత్రి ప్రెస్ క్లబ్ నేతృత్వంలో మీడియా ప్రతినిధులు ఆందోళన చేశారు.

తప్పుడు కేసులు అప్రజాస్వామికం: అమర్

వి.కోటలో అధికార పార్టీ నేతల మెప్పు పొందేందుకు విలేకరులపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబును మంగళవారం ఆయన పరామర్శించారు. టీడీపీ కార్యకర్తలను కొట్టడం, మిగిలిన నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జి చేసి.. తిరిగి వారిపైనే కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండు చేశారు. లేదంటే న్యాయపోరాటం చేస్తామన్నారు.




కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో బాబును పరామర్శిస్తున్న అమర్ తదితరులు

రంగులు మారుతున్న నగరి రాజకీయం

వాతావరణ మార్పులతో మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతుండగా, అంతకంటే ఎక్కువగా ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకమునుపే నగరి రాజకీయాలు వేడెక్కుతున్నాయి. టీడీపీతో దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకున్న సిద్ధార్థ కళాశాలల చైర్మన్, టీడీపీ నాయకుడు అశోక్‌రాజు మంగళవారం కమలం గూటికి చేరారు. కొంత కాలం నుంచి మంత్రి రోజాపై అస్త్రాలు ఎక్కుపెట్టిన అసమ్మతి నాయకులు అమీతుమీకి సిద్ధమవుతున్నారు.ఈ నేపథ్యంలో మంత్రి రోజా తెరవెనుక రాజకీయాలను ప్రారంభించారు. వరుస పెట్టి సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. నగరికి చెందిన మరో అసమ్మతి నాయకుడు కేజే కుమార్ దంపతులు సోమవారం సాయంత్రం సీఎం జగన్‌ను కలిశారు.

\- పుత్తూరు అర్బన్



కాషాయం కండువా కప్పుకున్న అశోక్‌రాజు

నిన్నటి వరకు పసుపు కండువాను ధరించిన అశోక్‌రాజు మెడలో కాషాయం చేరింది. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసి, ఆయనకు సన్నిహితుడిగా ముద్రపడిన అశోక్‌రాజు మంగళవారం ఉదయం విజయవాడలో బీజేపీ చీఫ్ పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 ఎన్నికల అనంతరం గుంభనంగా ఉన్న ఆయన వారం క్రితం టీడీపీకి రాజీనామా చేశారు. గత ఎన్నికల్లో వైసీపీకి పనిచేశానంటూ తనపై దుష్ప్రచారం చేశారని రాజీనామా సందర్భంగా మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అయితే అశోక్‌రాజు రాజీనామా తాము ముందు నుంచి ఊహించిందేనని, దీని వల్ల కలిగే నష్టం ఏమీలేదని టీడీపీ వర్గాలు తేల్చేస్తున్నాయి.



ఎక్కుపెట్టిన విల్లు దింపని అసమ్మతి

మంత్రి రోజాపై అసమ్మతి నాయకులు ఎక్కుపెట్టిన విల్లు ఇప్పట్లో దింపేలా కనిపించడం లేదు. వారం రోజులుగా మంత్రి రోజా,వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి మధ్య కొనసాగుతున్న పోరు మంగళవారం కొత్త రూపు సంతరించుకుంది. నగరిలో జరిగిన వైసీపీ నాయకుల సమావేశంలో మంత్రి రోజా భర్త సెల్వమణి అసమ్మతి నాయకులపై చేసిన కామెంట్ నిప్పు రాజేసింది. దీంతో పుత్తూరు నుంచి మాజీ ఎంపీపీ ఏలుమలై మొదలియార్, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చక్రపాణిరెడ్డి సోదరుడు, నింద్ర ఎంపీటీసీ రెడ్డివారి భాస్కర రెడ్డి, విజయపురం సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ లక్ష్మీపతిరాజు, పుత్తూరుకు చెందిన మరో సీనియర్ నాయకుడు రవిశేఖర్‌రాజు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ మంత్రి రోజా, ఆమె సోదరులు ఈ ఐదేళ్లలో నియోజకవర్గం కేంద్రంగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అలాగే తాము ఈ దఫా ఆమెకు ఎట్టిపరిస్థితుల్లోను పనిచేయబోమని కూడా తేల్చి చెప్పేశారు. ఏలుమలై మొదలియార్ తమ రెక్కల కష్టంతోనే రెండుసార్లు రోజా ఎమ్మెల్యేగా గెలిచిందన్నారు. గత ఎన్నికల మునుపు విజయపురంలోని తన ఇంట్లో జరిగిన సమావేశంలో మంత్రి రోజా దంపతులు తమను నమ్మించి ఎన్నికల తరువాత మోసం చేశారని లక్ష్మీపతిరాజు, రవిశేఖర్‌రాజు ధ్వజమెత్తారు. విజయపురం మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌లో 50 శాతం వాటా మంత్రి రోజా సోదరులకు ముట్టిందని ఆరోపించారు.ప్రజల్లో గూడుకట్టుకుని ఉన్న వ్యతిరేకతను గుర్తించకుండా అధిష్ఠానం మళ్లీ రోజాకు టికెట్ ఇస్తే ఆమె ఓటమికి తాము బాధ్యులు కాబోమని, ఆమెకు తప్ప వేరే ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా పార్టీ గెలుపు కోసం పనిచేస్తామని మీడియా సమావేశంలో జడ్పీటీసీ మురళీధర రెడ్డి, రెడ్డివారి భాస్కరరెడ్డి అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఐదు మండలాలకు చెందిన బలమైన నాయకులు మీడియా ముందుకు వచ్చి బహిరంగంగా వాఖ్యలు చేయడం వైసీపీ శ్రేణుల్లో అలజడి సృష్టించింది.

సీఎంతో కేజే దంపతుల భేటీ

తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఈడిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కేజే శాంతి, మాజీ మున్సిపల్ చైర్మన్ కేజే కుమార్ దంపతులు సోమవారం సాయంత్రం సీఎం జగన్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2019లో మంత్రి రోజా రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మొట్టమొదట బయటకు వచ్చింది కేజే కుమార్ దంపతులే. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. రోజా అభ్యర్థిత్వాన్ని కేజే కుమార్ దంపతులు తొలినుంచీ తీవ్రంగా విభేదిస్తున్నారు. సీఎంను కలిసిన కేజే కుమార్ దంపతులు భేటీ తరువాత నిరాశతో వెనుదిరిగినట్లు సమాచారం.

రాజకీయ భేటీలతో మంత్రి బిజీ

రాజకీయ సమావేశాలతో మంత్రి రోజా బిజీ బిజీగా గడుపుతున్నారు. మండలాల నుంచి వైసీపీ నాయకులను నగరిలోని తన కార్యాలయానికి పిలిపించుకుని చర్చిస్తున్నారు. ఇటీవల పీసీసీ ప్రెసిడెంట్ షర్మిల సభ నగరిలో విజయవంతం కావడంతో రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓట్లలో చీలిక రానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో అసమ్మతి నాయకుల ప్రభావం కూడా ఈ దఫా స్పష్టంగా ఉండనుందనే వాదనలున్నాయి. దీంతో నష్టనివారణ చర్యలకు దిగిన రోజా తన అనుకూల నాయకులతో పాటు ప్రధానంగా కులసమీకరణాలకు ప్రాధాన్యతనిస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఒక్కోరోజు ఒక్కో మండలం నుంచి ఒక ప్రధాన కులంతో సమావేశమై వారి మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. 2019లో సమరోత్సాహంతో ఎన్నికలను ఎదుర్కొన్న వైసీపీ క్యాడర్ ఈ ఐదేళ్లలో మారిన సమీకరణాలు, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తలెత్తిన అసంతృప్తి, వరుసగా పార్టీలో జరుగుతున్న సంఘటనలతో మునుపటి ఉత్సాహాన్ని ప్రదర్శించలేకపోతున్నాయనే ప్రచారం పొలిటికల్ సర్కిల్స్‌లో పెరుగుతోంది.

పరీక్ష రాసి వస్తూ..!

- రోడ్డు ప్రమాదంలో బీఫార్మసీ విద్యార్థిని మృతి



మృతి చెందిన విద్యార్థి ధన్య

శ్రీరంగరాజపురం, మార్చి 5: పరీక్ష రాసి.. కారులో వస్తున్న బీఫార్మసీ విద్యార్థిని ధన్య(25) మంగళవారం జరిగిన ప్రమాదంలో మృతిచెందారు. ఎస్ఆర్ పురం మండల పరిధిలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనంతో ఈ ప్రమాదం జరిగింది. చిత్తూరులో బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న ధన్య.. పుత్తూరులోని ఓ కళాశాలలో మంగళవారం పరీక్ష రాశారు. అనంతరం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఎస్ఆర్ పురం మండలంసీకేపురం వద్ద ఓ సెల్ ఫోను కంపెనీవారు తవ్విన గోతిని తప్పించబోయి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ధన్య అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవర్ త్రిసూల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం డ్రైవర్‌ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



పొలాలపై జంట ఏనుగుల దాడి



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా తోట



రామకుప్పం, మార్చి 5: మండల అటవీ సరిహద్దులో జంట ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా జంట ఏనుగులు సోమవారం రాత్రి ముద్దనపల్లె, బిరుగుండ్లపల్లె గ్రామాల సమీప పొలాలు, తోటల్లో తిరుగుతూ విధ్వంసం సృష్టించాయి. టమోటా, అరటి, దోస, వరి, రాగి పొలాల్లో సంచరిస్తూ తిన్నంతగా తిని ధ్వంసం చేశాయి. అటవీ అధికారులు వాటిని ట్రాకర్ల సాయంతో అడవిలోకి మళ్ళించారు.

జగన్‌ను బలపరచేవారు చేతులెత్తండి

● ప్రభుత్వ కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప వ్యాఖ్యలు
● సోషల్ మీడియాలో వైరల్

కుప్పం, మార్చి 5: 'జగన్మోహన్‌రెడ్డిని బలపరచాలా వద్దా? బలపరిచేవారు చేతులెత్తండి' అంటూ ఒక ప్రభుత్వ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కుప్పం మండల సచివాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ముందుస్తుగా జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు వేదిక పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రెడ్డెప్ప ప్రసంగం పక్కా ఎన్నికల ప్రచారాన్ని తలపించింది. 'మిమ్మల్నందరినీ ఒకేఒక చిన్న ప్రశ్న అడుగుతాను. దయచేసి మనసులో ఏముందో తెలియజేయండి. ఇక్కడ ఎమ్మెల్యేగా నిలబడుతున్న భరత్.. ఎంపీగా నిలబడుతున్న నేను ఉన్నాను. ఎన్నికలు జరిగితే ఆదరణ ఎవరికి ఇస్తారు? రేపు ఎన్నికలు జరిగితే ఎమ్మెల్యేగా.. (మాటలు కట్) మరీమరీ ప్రార్థిస్తున్నాను' అంటూ ఆ వాక్యం ముగిసింది. 'మీ ఇష్టం. జగన్మోహన్‌రెడ్డిని బలపరచాలా, వద్దా? బలపరచాలన్నవారు చేతులెత్తండి' అని అభ్యర్థించారు. సమావేశానికి హాజరైన అంగన్వాడీల్లో కొందరు విధిలేని పరిస్థితుల్లో చేతులెత్తారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ముసిముసిగా నవ్వుకుంటూ ఉండిపోయారు. ఎంపీ ఎన్నికల ప్రసంగం అధికారులకు మాత్రం ఉద్యోగ సంకటంగా తయారైంది.

నిర్దిష్ట ప్రణాళికతోనే రైతులకు ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ సంచాలకులు రమణ

చిత్తూరు (సెంట్రల్), మార్చి 5: వ్యవసాయ రంగంలో నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేసినప్పుడే రైతులకు ప్రయోజనం కలుగుతుందని తిరుపతి పరిశోధన స్థానం సహాయ సంచాలకుడు రమణ పేర్కొన్నారు. మంగళవారం చిత్తూరు ఏరువాక కేంద్రంలో శాస్త్రవేత్తల 40వ జిల్లా స్థాయి సమన్వయకర్తల సమావేశంలో రమణ, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహాయ విస్తరణ అధికారి ముకుందరావు మాట్లాడారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ రంగాల్లో రైతులకు కలిగే ప్రయోజనాలు, సాగులో పాటించాల్సిన మెలకువలు, పంటలను కాపాడుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన వ్యవసాయ, సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన శాఖ అధికారులు మురళీకృష్ణ, ప్రభాకర్, మధుసూదన్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రెడ్డిరాము, సుమతి, జాన్, విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 13,329 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 5: జిల్లాలో మంగళవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 13,329 మంది విద్యార్థులు హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. 14,012 మంది విద్యార్థులకు గాను 13,329 మంది హాజరు కాగా, 683 మంది గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. డీవీఈవో నాలుగు, జిల్లా కమిటీ సభ్యులు 10, స్క్వాడ్ ఎనిమిది సెంటర్లను పరిశీలించారు. కాగా మంగళవారం టెట్ జరగలేదు.

రైతులకు నష్టపరిహారం చెక్కుల పంపిణీ

విజయపురం, మార్చి 5: విజయపురం మండలం కోసలనగరం పంచాయతీలో ఏపీఐఐసీకీ భూములు అప్పగించిన రైతులకు మంగళవారం మంత్రి రోజా చెక్కులు పంపిణీ చేశారు. మొదటి విడతగా 1541.41 ఎకరాల భూమిని రైతులు ఏపీఐఐసీకీ అప్పగించారు. వీటిలో రహదారులు వేయడానికి 29.69 ఎకరాలకుగాను రూ.9.64 లక్షలు చొప్పున 27 మందికి రూ.2.40 కోట్లు పంపిణీ చేశారు. ఎంపీటీసీ కన్నెమ్మ, సర్పంచ్ ఉమామహేశ్వరి, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరావ్, నాయకులు శేఖర్‌రాజు, హరికృష్ణ, చెంచువరప్రసాద్, పెద్దగొళ్ల, సోమశేఖర్, రవివర్మ, నారపరాజు, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి రోజాకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తాం

వైసీపీ అధిష్ఠానానికి నగరి వైసీపీ నేతల అల్టిమేటం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 5: మంత్రి రోజాకు నగరి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని నియోజకవర్గ వైసీపీ నాయకులు అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డితో పాటు నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు రెడ్డివారి భాస్కర రెడ్డి, ఏలుమలై, రవి, శేఖర్‌రాజు,వాసుదేవరెడ్డి, మునీంద్ర, లక్ష్మీపతిరాజు, శ్రీధర్‌రాజు, సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో రోజాను గెలిపించడానికి ఆస్తులమ్ముకుని కష్టపడ్డామని చెప్పుకొచ్చారు. తనకు ఐదుగురు అన్నదమ్ములు అని ప్రతి సభలో ఊదరగొట్టిన రోజా ఇపుడు తమనే ఇబ్బందులపాల్జేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2004, 2009 ఎన్నికల్లో ఓటమి పాలైన రోజాకు బాసటగా నిలిచామని, ఐరన్ లెగ్‌గా పేరు పొందిన రోజాను గోల్డెన్‌లెగ్‌గా మార్చి 2014లో ఎమ్మెల్యేని చేశామన్నారు.నగరి నియోజకవర్గాన్ని తన అక్రమార్జనకు అడ్డాగా చేసుకున్న మంత్రి రోజా తమను పక్కకు నెట్టేసిందన్నారు. నగరి ప్రజలు ఆమె పట్ల సానుకూలంగా లేరన్నారు. వైసీపీ అధిష్ఠానం ప్రజాభీష్టంతో పాటు క్యాడర్ విజ్ఞప్తిని మన్నించి ఎమ్మెల్యే టిక్కెట్టు ఇతరులకు కేటాయిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. అలాకాదని రోజాకే సీటు కేటాయిస్తే ఓడిస్తామని హెచ్చరించారు. తమపై నిందారోపణలు చేస్తున్న మంత్రి రోజా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

అనారోగ్యంతో ఆడసింహం మృతి



మృతి చెందిన సింహం

తిరుపతి(మంగళం), మార్చి 5: శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శన శాల (జూ)లో ఓ ఆడ సింహం అనారోగ్యంతో మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు క్యూరేటర్ సెల్వం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2017లో జన్మించిన ఈ సింహం ఏడాది కాలంగా ట్యూమర్ వ్యాధితో బాధపడుతోంది. ఈక్రమంలో మెరుగైన వైద్యమందిస్తున్నా కోలుకోలేదన్నారు. క్రమేణా ఆరోగ్యం క్షీణించి నాలుగు రోజులుగా ఆహారం కూడా తీసుకోలేదని తెలిపారు. చివరకు తీవ్ర అనారోగ్యానికి గురై చనిపోయిందన్నారు. కళేబరాన్ని పంచనామ నిమిత్తం ఎస్వీ మెటర్నిటీ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

బెస్తపల్లెలో అడవి పందుల బీభత్సం



బెస్తపల్లె వద్ద బావిలో పడ్డ అడవి పందులు

ఐరాల, మార్చి 5: ఐరాలకు కూతవేటు దూరంలోని బస్తపల్లెలో మంగళవారం అడవి పందులు బీభత్సం సృష్టించాయి. అడవి పందుల గుంపు నీటి కోసం గ్రామానికి సమీపంలోని వ్యవసాయ పొలాల వద్దకు వేకువజామున వచ్చాయి. ఈ క్రమంలో అడవి పందుల గుంపు గ్రామం ముందున్న ఓ నేల బావిలో ఒకదాని తరువాత ఒకటి పడిపోయాయి. ఉదయం వెలుతురు వచ్చిన తర్వాత అడవి పందులు భయానికి గురై ఉదయం 5గంటల నుంచి ప్రయత్నించి 9గంటల ప్రాంతంలో బయటపడ్డాయి. ఈ విషయాన్ని గమనించిన బెస్తపల్లె గ్రామస్తులు భయంతో కేకలు వేయడంతో అడవి పందులు గ్రామంలోని ఇళ్లల్లోకి ప్రవేశించాయి. దీంతో గ్రామస్తులు తమ ఇళ్లకు తలుపులు బిడాయించుకున్నారు. అడవి పందులు ఇళ్ల తలుపులను తలలతో గుద్ది గ్రామంలో అటు ఇటు పరుగు తీశాయి. వీధుల్లో ఉన్న ద్విచక్ర వాహనాలను దొర్లించాయి. సుమారు గంటపాటు గ్రామంలో బీభత్సం సృష్టించాయి. ఆ తర్వాత సమీపంలోని అడవిలోకి పరుగులు తీయడంతో గ్రామస్తులు ఊపిరి తీసుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు విచ్చేసి అడవి పందులు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

శివరాత్రి ఉత్సవాల్లో భూతరాత్రి ఏకాంతం



ఆలయంలోనే ఆదిదంపతుల ప్రదక్షిణ

శ్రీకాళహస్తి, మార్చి 5: వాయులింగేశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాల్లో మంగళవారం జరగాల్సిన భూత రాత్రి మొదటి వాహన సేవ ఏకాంతంగా జరిగింది. మంగళవారం రాత్రి స్వామివారు భూత, అమ్మవారు శుక (చిలుక)వాహనంపై అధిష్ఠించి భక్తులకు దర్శనం ఇవ్వాల్సి ఉంది. కానీ మాడ వీధుల్లోని నెహ్రూ రోడ్డుకు ఆనుకుని ఉన్న జెట్టిపాలెం సందులో ఒకరు శివైక్యం చెందారు. సంప్రోక్షణకు సమయం సరిపోకపోవడంతో ఆగమ నియమం ప్రకారం భూత వాహన సేవను ఏకాంతంగా మార్చారు.ఆలయంలోపలే ఉత్సవమూర్తులను ప్రదక్షిణ పూర్వకంగా తిప్పి తిరిగి కొలువుదీర్చారు.మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై చంద్రశేఖరుడి రాజసం, చప్పరంపై జ్ఞానాంబిక అమ్మవారి వైభవాన్ని భక్తులు దర్శించుకుని తరించారు.

'పుంగనూరు'కు కేంద్ర బలగాలు పంపండి

● ఏకపక్షంగా అధికారులు, పోలీసుల వైఖరి ● మంత్రి పెద్దిరెడ్డి అక్రమాలను నియంత్రించండి
● కేంద్ర ఎన్నికల సంఘానికి బీసీవైపీ అధినేత ఫిర్యాదు

పుంగనూరు, మార్చి 5: 'పోలీసు అధికారులు, ఇతర ప్రభుత్వోద్యోగులు మంత్రి పెద్దిరెడ్డి అండ్ కోకు ప్రైవేటు సైన్యంలా పనిచేస్తున్నారు. వీరి ద్వారా దొంగ ఓట్లకు కుట్ర జరుగుతోంది. అందుకని పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర బలగాలను పంపించాలి. పోలింగ్ బూత్‌లలో వీడియోగ్రఫీ, నిఘా ఏర్పాటు చేయాలి' అని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతూ బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ లేఖ రాశారు. గతంలో ఎన్నికల సమయంలో బూత్ ఏజెంట్లకు బెదిరింపులు, బలవంతం చేయడం వంటి ఘటనలతోపాటు కొన్ని పోలింగ్ బూత్‌లను స్వాధీనం చేసుకున్నట్లు కూడా నివేదికలు ఉన్నాయని పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందిని మేనేజ్ చేసుకుని దొంగ ఓట్లు కూడా వేయించుకున్నారని ఆరోపించారు. పుంగనూరు అసెంబ్లీ ప్రాంతానికి 5 కిలోమీటర్ల నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సరిహద్దు ప్రాంతం కర్ణాటక రాష్ట్ర ప్రజలను తీసుకొచ్చి బోగస్ ఓట్లు వేయించారన్నారు. గత పోలింగ్‌లో జరిగిన ఉల్లంఘనపై అనేక ఫిర్యాదులు వచ్చినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. తిరుపతి ఉప ఎన్నికల్లో ఎపిక్ కార్డుల స్కామ్ ద్వారా దొంగ ఓట్ల పోలింగ్ జరిగిందని, ఇప్పుడు అదే మాదిరిగా పుంగనూరులోనూ జరిగే అవకాశం ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ఎన్నికల కోడ్ రాకముందే ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ పోలీసులు అక్రమంగా సెర్చ్ వారెంట్ తెచ్చి తన నివాసాల్లో తనిఖీలు చేశారని, కేసులు బనాయించారని తెలిపారు. ఇక, పుంగనూరులో ప్రతిపక్షాలపైనే తప్పుడు కేసులు పెట్టడం ఆనవాయితీగా మారిందని పేర్కొన్నారు. అందుకని ఈ ఎన్నికలకు కేంద్ర బలగాలను పంపి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలు నిరోధించేలా గట్టి చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. గతంలో పెద్దిరెడ్డికి అనుకూలంగా ఎస్పీగా పనిచేసి ప్రస్తుతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా ఉన్న రిషాంత్ రెడ్డి, గతంలో పలమనేరు డీఎస్పీ, ప్రస్తుతం చిత్తూరు ఎస్బీలో పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి, పుంగనూరు సీఐగా పనిచేసి ప్రస్తుతం చిత్తూరు సీఐగా ఉన్న గంగిరెడ్డి, పోలీసు అధికారులు మధుసూదన్ రెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, తహసీల్దారు సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్పీ జాషువా, మునిసిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ రెడ్డి అధికారపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రీవారి సెంటిమెంట్‌తో టికెట్ కోసం...

చంద్రబాబుకు నరసింహయాదవ్ లేఖ

తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో పదవుల కోసం, అవకాశాల కోసం నేతలు రకరకాల మార్గాలు ఎంచుకోవడం పరిపాటి. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ కూడా తిరుపతి టీడీపీ టికెట్ కోసం శ్రీవారి సెంటిమెంట్‌ను తెరపైకి తీసుకొచ్చారు. తిరుమలలో శ్రీవారు యాదవులకు తొలి దర్శన భాగ్యం కల్పించారని.. అలాగే తిరుపతిలో ఎమ్మెల్యేగా యాదవులకు తొలిసారి అవకాశం కల్పించాలంటూ అధినేత చంద్రబాబును అభ్యర్థించారు. ఈ మేరకు ఆయన ఓ లేఖను మంగళగిరిలో మంగళవారం జరిగిన జయహో బీసీ సదస్సు వేదికపై చంద్రబాబుకు అందజేశారు. తిరుమల, తిరుపతిలకు చెందిన యాదవులతో వెంకటేశ్వర స్వామికి బంధం వుందని పేర్కొన్నారు. అదే సామాజికవర్గానికి చెందిన తనకు తిరుపతి అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా వున్న యాదవ సామాజికవర్గానికి తెలుగుదేశం పార్టీపై అభిమానం మరింత పెరిగే పరిస్థితి వుంటుందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా తిరుపతి టీడీపీలో కొనసాగుతున్న నరసింహయాదవ్ బీసీ కోటాలో అసెంబ్లీ టికెట్ కోసం గత ఎన్నికల్లోనూ గట్టిగా యత్నించారు. టికెట్ దక్కకపోయినా తుడా చైర్మన్ పదవి లభించింది. తర్వాత పార్లమెంటు పార్టీ అధ్యక్ష పదవి కూడా దక్కింది. రానున్న ఎన్నికల్లో కూడా టికెట్ కోసం రేసులో వున్న నరసింహ యాదవ్ పార్టీ జయహో బీసీ సదస్సులో ఈ మేరకు లేఖ అందజేసి అధినేత దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించారు.

రేపు పద్మావతి మహిళా వర్సిటీ స్నాతకోత్సవం

గాయని సుశీలకు గౌరవ డాక్టరేట్ - గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక



మీడియాతో మాట్లాడుతున్న వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 5: తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవం గురువారం నిర్వహించనున్నారు. వివరాలను వర్సిటీలో మంగళవారం వీసీ భారతి మీడియాకు వెల్లడించారు. ఆమె మాటల్లోనే.. 'ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. గాయని పి.సుశీలకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నాం. 57మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తాం. 12మందికి పుస్తక, నలుగురికి నగదు బహుమతులిస్తాం. విద్యార్థులను ఉద్దేశించి ఇస్రో శాస్త్రవేత్త మంగళ మణి ప్రసంగిస్తారు. 859 మందికి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేస్తాం. ఇటీవల కాలంలో వర్సిటీ మంచి అభివృద్ధిని సాధిస్తోంది. నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించాం. పీఎం ఉష పథకం ద్వారా రూ.100 కోట్లు పొందాం' అని వీసీ వివరించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ రజని, సీనియర్ ప్రొఫెసర్ త్రిపురసుందరి, పీఆర్వో శ్రీరజని పాల్గొన్నారు.

బిల్లులు చెల్లిస్తేనే సచివాలయంలోకి...!



తనకు బిల్లులు చెల్లించే వరకు సచివాలయంలోకి వెళ్లడానికి వీల్లేదంటూ కేవీబీపురం మండలం ఓళ్లూరు సర్పంచ్ సురేష్ సిబ్బందిని అడ్డుకున్నారు. గ్రామస్తులు, వార్డు మెంబర్లతో కలిసి మంగళవారం ఉదయం సచివాలయానికి వచ్చిన సిబ్బందిని లోనికి వెళ్లనీయకుండా డోరు వద్ద అడ్డంగా బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ దయాసాగర్ సచివాలయం వద్దకు వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. గతంలో చేసిన రెండు మోటారు పనులకు రూ.5లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని, అలాగే ప్రస్తుతం మరమ్మతులకు గురైన బోర్లను బాగుచేయించేందుకు సైతం బిల్లులు ఏర్పాటు చేయాలని సర్పంచ్ కోరారు.తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బందిపడుతున్నారని వాపోయారు.తాను టీడీపీ సర్పంచ్ కావడంతోనే ఎంబుక్ బిల్లు పెట్టడం లేదని సర్పంచ్ ఆరోపించారు. రెండు రోజుల్లో బిల్లులు చెల్లించే ప్రయత్నం చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చాక ఆందోళన విరమించారు.

- కేవీబీపురం

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదు

● ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు



చిత్తూరు రూరల్, మార్చి 5: జిల్లాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకూడదని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ సుబ్బరాజు ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లు, జిల్లా స్టోర్స్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం చిత్తూరులోని అర్బన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. వేసవి మొదలైందని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పరీక్షల సమయం కావడంతో 24 గంటలూ విద్యుత్ సరఫరా అందించాలని తెలిపారు. విద్యుత్ బిల్లుల పెండింగ్ బకాయిలను త్వరగా వసూలు చేయాలన్నారు. ఎండలకు ఎక్కువ శాతం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే ప్రమాదముందని, వీటిని వెంటనే మరమ్మతు చేయాలన్నారు. ఈఈలు పద్మనాభపిళ్లై, హరి, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ వేదికపైకి అగ్నికుల్



ప్రైవేట్ రంగంలో రెండో రాకెట్ ప్రయోగానికి శ్రీహరికోటలోని షార్ సిద్ధమవుతోంది. త్వరలో అగ్నికుల్ రాకెట్‌ను ప్రయోగించనున్న నేపథ్యంలో రాకెట్‌ను షార్‌లోని ఏఎస్ఎల్వీ కాంప్లెక్స్‌లో అనుసంధానం చేశారు. మంగళవారం రాకెట్‌ను ప్రైవేట్ ప్రయోగ వేదికకు తరలించారు. అగ్నికుల్ కాస్మోస్,మద్రాసు ఐఐటీ స్పేస్ టెక్నాలజీ స్టార్టప్ తరపున సబ్ ఆర్బిటల్ రాకెట్‌ను రూపొందించి షార్ నుంచి ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్నికుల్ ప్రయోగ వాహకనౌకకు అగ్నిబాన్ సబార్బిటల్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్ (ఎస్ఓఆర్ టీఈడీ)గా నామకరణం చేశారు. ప్రస్తుతం ప్రయోగ వేదిక రాకెట్‌కు పలు తనిఖీలు జరుగుతున్నాయి. ఇది అగ్నిలెట్ ఇంజన్‌తో నడిచే సింగిల్ స్టేజ్ వాహక నౌక. ఈ సెమీ క్రయోజనిక్ ఇంజన్‌ను పూర్తిగా 3డీ సాంకేతికతతో రూపొందించారు. 6కేఎన్ సామర్థ్యాన్ని కలిగిన ఈ రాకెట్‌లో 300 కిలోల పేలోడ్‌తో 700 కిలోమీటర్ల దూరంలో పంపే విధంగా డిజైన్ చేశారు. షార్‌లో అగ్నికుల్‌కు చెందిన సొంత ప్రయోగ వేదిక, మిషన్ కంట్రోల్ సెంటర్‌ను గత ఏడాది ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

- సూళ్లూరుపేట

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

చిత్తూరు, మార్చి 5: అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థిని మృతిచెందిన సంఘటన చిత్తూరులో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ విశ్వనాథ రెడ్డి తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం రెడ్డివారిపూరుకు చెందిన పూజిత (17) తన అన్నతో కలిసి చిత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. ఇక్కడే ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పూజిత అన్న సోమవారం మదనపల్లెకు వెళ్లి మంగళవారం తిరిగి చిత్తూరుకు వచ్చాడు. తాను అద్దెకు ఉంటున్న ఇంటి తలుపులను తట్టగా ఎంతసేపటికీ పూజిత తలుపు తెరవకపోవడంతో కిటికీలోంచి చూశాడు. అప్పటికే పూజిత ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మా భూములు తీసుకొని.. మాపైనే దౌర్జన్యమా?



రామాపురం సీఎంసీ వద్ద నినాదాలు చేస్తున్న దళితులు

గుడిపాల, మార్చి 5: 'ప్రజల కోసమని చెప్పి మా భూములను లాక్కొని సీఎంసీకి ఇచ్చారు. ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదు. భూములను చదును చేస్తుండటాన్ని ప్రశ్నిస్తే మాపైనే దౌర్జన్యం చేస్తారా?' అంటూ గుడిపాల మండలం 190 రామాపురం దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం 190 రామాపురం సీఎంసీ వద్ద సుమారు 20 కుటుంబాల వారు నిరసన తెలిపారు. 15 ఎకరాల సెటిల్‌మెంట్ భూమిని సీఎంసీ అధికారులు ఆక్రమించుకుని ఇంతవరకు రూపాయి కూడా చెల్లించకుండా కడుపు కొడుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేసేంతవరకు పోరాడతామని, బుధవారం ధర్నా చేస్తామని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఒకరి అరెస్టు



పెనుమూరు, మార్చి 5: అక్రమంగా తరలిస్తున్న రూ.80వేల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. సెబ్ సీఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లె సమీపంలోని పొలంలో 26 బాక్సుల కర్ణాటక మద్యాన్ని పూడ్చిపెట్టారని పోలీసులకు సమాచారం అందింది. మంగళవారం పోలీసులు దాడి చేసి పూడ్చిపెట్టిన 2496 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, శివకోటిరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ దాడుల్లో ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది జయశంకర్, సురేంద్ర పాల్గొన్నారు.

పేలుడు ఘటనలో ఇద్దరిపై కేసు

గంగాధరనెల్లూరు, మార్చి 5: గంగాధరనెల్లూరు మండలం కొట్రకోన పంచాయతీ కె.లక్ష్మీరెడ్డిపల్లెకు సమీపంలోని స్టోన్ క్రషర్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన పేలుడుకు సంబంధించి ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ గటనలో 20 ఇళ్ళకుపైగా కిటికీలు, గాలి కిటికీలు, షోకేస్ అద్దాలు పగిలిపోయి, ఐదారు ఇళ్ల గోడలు బీటలు వారాయి. దీనిపై తహసీల్దార్ రవి, సిబ్బంది, గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి సీఐ, చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ తమ సిబ్బందితో కలిసి పేలుడు సంభవించిన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. కె.లక్ష్మీరెడ్డిపల్లె గ్రామస్తులను విచారించారు. అధికారుల విచారణలో స్టోన్ క్రషర్ నిర్వహించి సుమారు మూడునెలలు కావొస్తుందని వెలుగులోకి వచ్చింది. అయితే ఏకారణం చేత సోమవారం పెద్ద ఎత్తున పేలుడు సంభవించిందనేది విచారణలో తేలుతుందని అధికారులు పేర్కొన్నారు. స్టోన్ క్రషర్ లైసెన్స్ యాజమాని శ్రీధర్, స్టోన్ క్రషర్‌కు జిలెటిన్‌స్టిక్స్ సరఫరా చేసే లైసెన్స్‌హోల్డర్ రమేష్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెస్ట్ సీఐ తెలిపారు.

రేపు సారంగపాణి ప్రాజెక్టు ప్రారంభం

తిరుపతి (కల్చరల్), మార్చి 5: చిత్తూరు జిల్లా కార్వేటినగరం ప్రాంతంలో నివసించిన 17వ శతాబ్దానికి చెందిన వాగ్గేయకారుడు, కర్ణాటక సంగీత స్వరకర్త, వేణుగోపాలస్వామి భక్తుడు సారంగపాణి పేరిట టీటీడీ ఓ ప్రాజెక్టును ప్రారంభించనుంది. సుమారు 5వేలకుపైగా కీర్తనలు రచించిన ఈయన జీవన విశేషాలు భావితరాలకు అందించడానికి ఈ ప్రాజెక్టు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. శ్వేత భవనంలో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో ప్రముఖ సినీ నేపథ్య గాయని పి.సుశీల, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణయాచేంద్ర తదితరులు పాల్గొంటారు.

ఎన్ఎంయూ పోరాటాలతోనే ఆర్టీసీ కార్మికులకు సౌకర్యాలు


డ్రైవర్‌ను యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

కుప్పం, మార్చి 5: ఎన్ఎంయూ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పి.రామ్మోహన్‌రావు పోరాటాల ఫలితంగానే ఆర్టీసీ కార్మికులు నేడు అనుభవిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలు సమకూరాయని ఎన్ఎంయూఏ నాయకులు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం రామ్మోహన్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రామ్మోహన్‌రావు కృషి ఫలితంగానే ఎస్ఆర్‌బీఎస్, ఏటీటీ, సీసీఎస్ వంటి సంక్షేమ పథకాలు ఆర్టీసీలో ప్రవేశపెట్టారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా కమిటీ సభ్యులు జె.శ్రీను, మొగిలీశ్వరయ్య, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మునస్వామి, ఇ.జయపాల్, గ్యారేజ్ అధ్యక్షుడు ఎ.వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్, ఎంటీవీ.కుమార్, జేఎస్.నారాయణ, జేవీ.రమణ, ఎస్ఆర్.రాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నుంచి ఎస్.భూపతి అనే డ్రైవర్, జిల్లా అధ్యక్షుడు వేలు సమక్షంలో ఎన్ఎంయూఏ సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు.

సేవ్ ఎడ్యుకేషన్ పేరుతో సంతకాల సేకరణ

పుంగనూరు, మార్చి5: కేంద్ర నూతన విద్యావిధానం-2020ని వ్యతిరేకిస్తూ సేవ్ ఎడ్యుకేషన్ అనే నినాదంతో దేశవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ చేస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కాలేజీ విద్యార్థులతో కలసి సంతకాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ ఏపీలో ఎన్ఈపీ-2020ని అమలు చేయడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో 117, 118 వల్ల మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలను విలీనం చేయనున్నట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయించాల్సివుందన్నారు. దాదాపు 5800 ఏకోపాధ్యాయ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులు పెరుగుతున్నారన్నారు. పీజీ విద్యార్థులకు విద్యను దూరం చేయడానికి జీవో 77 తీసుకువచ్చి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నట్లు పేర్కొన్నారు.

మహిళా దినోత్సవంలో రాజకీయాలా?: సీపీఎం

పుంగనూరు రూరల్, మార్చి5: కుప్పంలో మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్వాడీలతో జరిపిన సభలో రాజకీయాలు మాట్లాడటం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కుప్పం ఐసీడీఎస్ ప్రాజెక్టులో అధికారకంగా అంగన్వాడీలు సెలవు ప్రకటించి మహిళా దినోత్సవాన్ని జరిపిస్తే ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ ఆ సమావేశంలో రాజకీయాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాలకతీతంగా జరగాల్సిన సమావేశంలో రానున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని చెప్పడం బాధాకరమన్నారు. అంగన్వాడీలను వేధించిన సమయంలో వారి ఓట్లు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. సమస్యలపై పోరాటానికి సిద్ధమైన వారిని విధుల నుంచి తొలగిస్తామని బెదిరించి కోర్టు ఆదేశాలతో విధుల్లోకి వస్తే ఇప్పుడు అంగన్వాడీలు గుర్తుకు వచ్చారని అని ప్రశ్నించారు మహిళా దినోత్సవం పేరుతో అంగన్వాడీ కార్యకర్తల వద్ద రూ. 300నుంచి రూ. 500 వసూల్లు చేయడం సిగ్గుచేటుగా ఉందన్నారు.

5జీ టెక్నాలజీపై వర్క్‌షాప్ ప్రారంభం



మాట్లాడుతున్న అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి

గంగవరం,మార్చి5 : స్థానిక మదర్‌థెరిసా కళాశాలలో ఈసీఈ విద్యార్థులకు 5జీ టెక్నాలజీపై 5రోజుల వర్క్‌షాప్‌ను అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మేధోశక్తి పెంపొందించడానికి వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలు వస్తే, వాటిని నివృత్తి చేసుకుని టెక్నాలజీపై పూర్తి పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

భూతగాదాలో పలువురికి తీవ్ర గాయాలు


గాయపడిన చెన్నారెడ్డి

పుంగనూరు రూరల్, మార్చి5: భూతగాదాలో ఇరువర్గాలు ఘర్షణపడి తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం పుంగనూరు మండలంలో జరిగింది. రాగానిపల్లె పంచాయతీ లక్కుంటకు చెందిన వెంకటరెడ్డి కుమారుడు కృష్ణారెడ్డి, అదేగ్రామానికి చెందిన చెన్నారెడ్డిలు కలసి యూఎస్ఆర్ సర్కిల్‌లో మద్యం సేవించి భూముల విషయంపై గొడవ చేసుకున్నారు. దీంతో కృష్ణారెడ్డి కుటుంబసభ్యులైన మురళి, గంగిరెడ్డి కుమారుడు తరుణ్‌కుమార్, గంగిరెడ్డిలను పిలుపించుకున్నట్లు చెన్నారెడ్డి తెలిపారు. వారు తనపై బీరు బాటిల్‌లో దాడి చేయగా గాయపడినట్లు ఆయన తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర పథకాలపై ప్రచారం



పుంగనూరు రూరల్, మార్చి5: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తున్నట్లు బీజేపీ పట్టణాధ్యక్షుడు పెద్దమఠం బాబు తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినట్లు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లికారాణి, మదన్మోహన్‌బాబు, పూలప్రేమ్‌కుమార్, ఆదినారాయణ, మునిరత్నం, నానబాల కుమార్, వెంటకరెడ్డి, శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సర్పదోష పూజలు



రామకుప్పం, మార్చి 5: పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. రాహుకాలంలో పురోహితులు కృష్ణమూర్తి, నాగరాజుశర్మ పలువురు భక్తులచే సర్పదోష నివారణ పూజలు చేయించారు. ప్రతి మంగళవారం రాహుకాలంలో సర్పదోష నివారణ పూజలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మామిడి తోటకు నిప్పు

పుంగనూరు, మార్చి5: చౌడేపల్లె మండలం 29ఏ చింతమాకులపల్లె సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటకు నిప్పు పెట్టినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 29 ఏ.చింతమాకులపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డియాదవ్ మామిడి తోటకు నిప్పు పెట్టినట్లు గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్లు ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, మార్చి 5: రామకుప్పంలో పారిశుధ్య కార్మికుడిగా ఉన్న దేవదాసు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ తరపున వారికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

చంద్రబాబుకు లక్ష మెజారిటీయే లక్ష్యం

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, మార్చి 5: రానున్న ఎన్నికల్లో కుప్పం నుంచి టీడీపీ అధినేత చంద్రబాబుకు లక్ష మెజారిటీయే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కోరారు. మంగళవారం రామకుప్పంలో టీడీపీ-జనసేన ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు కూడా విపక్షనేతలు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయిందని, ప్రశ్నిస్తే అక్రమ కేసులతో వేధిస్తున్నారన్నారు. వైసీపీ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా టీడీపీ-జనసేన శ్రేణులు బెదిరేది లేదని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ సానుభూతి పరుల ఇళ్లకు కూడా వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించాలన్నారు. సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహకకార్యదర్శి పట్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, జనసేన మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హరీశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతో రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ

కుప్పం : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తుకు, రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పం పురపాలక సంఘంలోని 9, 10, 11 వార్డుల్లో వారు కార్యకర్తలు, ఇతర నాయకులతో కలసి మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు.

సూపర్ సిక్స్‌తో సంక్షేమం

శాంతిపురం : చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతోనే సంక్షేమ రాజ్యం సాకారమవుతుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రాళ్ళబూదుగూరు, శివరామపురం, కొలమడుగు, దండికుప్పం, కోనేరుకుప్పం, 121పెద్దూరు, తుమ్మిశి, మొరసనపల్లె, కర్లగట్ట, కడపల్లె, సి.బండపల్లె, మఠం, ఎంకేపురం, సోన్నేగానిపల్లె, రేగడదిన్నేపల్లె, అనికెర, 64పెద్దూరు, నడింపల్లె, చిన్నారిదొడ్డి, కెనమాకులపల్లె, అబకలదొడ్డి, గుంజార్లపల్లె, చెంగుబల్ల గ్రామ పంచాయతీలలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. గౌనివారితోపాటు మాజీ ఎంపీపీ ఉదయకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, ఇతర నేతలు ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ వైసీపీ పాలనలో ప్రజల కష్టాలు గురించి వివరించారు.

దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి


మండల సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళిత నేతలు

శాంతిపురం, మార్చి 5 : దళితుడి ఇంటి నిర్మాణాన్ని అడ్డుకొని దాడి చేసిన వారి మీద ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మంగళవారం ఎమ్మార్పీఎస్, మహజన సోషలిస్టు పార్టీ నేతలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గత 10 రోజులు క్రితం అబకలదొడ్డికి చెందిన మునెప్ప గ్రామ కంఠంలో ఇంటి నిర్మాణం చేపడుతుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత, ఉప సర్పంచ్ ఆదినారాయణ, అనుచరులు ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుని మునెప్పపై దాడి చేశారన్నారు. దాడి జరిగిన రోజు అదినారాయణ, అతడి అనుచరులపై రాళ్ళబూదుగూరు పోలీసులకు, తహసీల్దార్, ఎంపీడీవో, సీఐ, డీఎస్పీకి, ఆర్డీవోకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. విచారణ చేపట్టి ఎవరి పేరుపై రికార్డులుంటాయో వారికి న్యాయం చేస్తామని, అంతవరకు నిర్మాణం ఆపాలని అధికారులు మునెప్పకు, దళిత నేతలకు తెలిపారు. అప్పటి నుంచి పోలీసుల వద్దకు వస్తే ఎవరూ అందుబాటులో ఉండరని, ఎన్ని రోజులు తిరగాలని ఆగ్రహించిన దళిత నేతలు మునెప్ప కుటుంబ సభ్యులు మండల సచివాలయం ఎదుల ధర్నాకు దిగారు. అధికారులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు గంటపాటు ధర్నా కొనసాగింది. అధికారులు ఎవరూ లేకపోవడంతో పంచాయతీ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేసి బుధవారం నుంచి ఇంటి నిర్మాణ పనులు చేపడతామని, అక్కడ ఏమి జరిగినా అధికారులదే బాధ్యత అని హెచ్చరిస్తూ ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు దేవరాజులు, రవింద్ర, వేణు, శంకరప్ప, కోదండప్ప, రాము, నరసింహులు, మురుగేష్, రమేష్, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో డీఈవో ముఖాముఖి


పలమనేరు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో డీఈవో

పలమనేరు, మార్చి5 : పలమనేరు బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థినులతో మంగళవారం డీఈవో దేవరాజు ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రధాని ఎక్సలెన్స్ అవార్డు కోసం రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు మంగళవారం ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్ని పాఠశాలల విద్యార్థినులతో గూగుల్ మీట్ ద్వారా సంభాషించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు కూడా పాల్గొన్నారు.ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం, ప్రధానోపాధ్యాయిని లత, సీఆర్‌పీలు పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఈవో దేవరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు రాబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల విషయంలో విద్యార్థినులు ఒత్తిళ్లకు గురికాకుండా మానసిక స్థయిర్యాన్ని నింపాలన్నారు. వెనుకపడిన విద్యార్థినుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

శ్రీశైల మల్లన్నకు పట్టు వస్త్రాల సమర్పణ



ఐరాల, మార్చి 5: శ్రీశైల మల్లన్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరపున పట్టు వస్త్రాలను ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు మంగళవారం సమర్పించారు. వారిని మల్లన్న ఆలయ చైర్మన్ చక్రవర్తిరెడ్డి, ఈవో పెద్దిరాజు ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఆలయ ఏఈవోలు హరిదాసు, స్వాములు, మోహన్, వరసిద్ధుడి ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయండి

- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్ పిలుపు

చిత్తూరు సిటీ, మార్చి 5: ఈనెల 9వ తేదీన గుంటూరులో నిర్వహించే ఛలో అమరావతి వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని వీహెచ్‌పీఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి) రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంపుదల చేయాలని, శారీరక వికలాంగుల రోస్టర్ పాయింట్ 56తో పాటు బధిరుల రోస్టర్ పాయింట్ 31ని 10లోపు కుదించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా వున్న మైదానంలో నిర్వహించే ఛలో అమరావతి వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాగర్జన సభకు వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వికలాంగులందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విలేకరులపై అక్రమ కేసులా?

- ఎత్తివేయాలంటూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన వి.కోటలో నిరసన


అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

వి.కోట, మార్చి 5: ప్రజల పక్షాన అక్షర సమరంగా నిలిచిన పాత్రికేయులపై కక్షకట్టి అక్రమ కేసులు పెట్టడం ఏమిటని ప్రెస్‌క్లబ్ సభ్యులు ప్రశ్నించారు. వి.కోటలో జర్నలిస్టులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలంటూ అంబేడ్కర్ కూడలిలో మంగళవారం రాత్రి నిరసన తెలిపారు. సోమవారం రాత్రి పోలీసులే విలేకరుల పట్ల దురుసుగా ప్రవర్తించి, ఆపై విధులకు ఆటంకం కలిగించారంటూ తమపైనే తప్పుడు కేసులు బనాయించడం సమంజసం కాదన్నారు. విలేకరుల విధులకు ఆటంకం కలిగించి, దురుసుగా ప్రవర్తించిన పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులు, ఇతర పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వి.కోట ఎస్ఐ బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, కోశాధికారి షఫీరుల్లాఖాన్, ఇతర జర్నలిస్టులు నిస్సార్, దేవరాజ్, శ్రీనివాసులు, దొరస్వామి, రమేష్, రోషన్, సునిల్, గిరి, అశోక్, సురేంద్ర, మోహన్, హరినాథ్, అన్వర్ తదితరులున్నారు.

12 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు

యాదమరి, మార్చి 5: కామాక్ష్యాంబాదేవి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 12వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారు ఒక్కో వాహనంలో భక్తులకు దర్శనమిస్తారని అన్నారు. ఈ నెల 8వ తేదీన మహాశివరాత్రి పండగ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం చేస్తారన్నారు. అదే రోజు రాత్రి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 12వ తేదీన పల్లకి సేవతో మహాశివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

నిరుద్యోగులను దగా చేసిన జగన్ : జనసేన

కార్వేటినగరం, మార్చి 5: రాష్ట్రంలోని నిరుద్యోగులను సీఎం జగన్ దగా చేశారని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పొన్నా యుగందర్ విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పుల ఊబిలో రాష్ట్రాన్ని ముంచిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందని ఆరోపించారు. వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక అల్లాడిపోతున్నారని, ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదని గుర్తు చేశారు. వచ్చిన పరిశ్రమలు కూడా వెళ్లిపోయే దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

మన ఓటు.. మన భవిష్యత్తు పుస్తకావిష్కరణ



ఐరాల(కాణిపాకం), మార్చి 5: కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయులు మన ఓటు... మన భవిష్యత్తు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో పాత పింఛను విధానాన్ని అమలు చేస్తామని ఏ రాజకీయ పార్టీ హామీ ఇస్తుందో ఆ పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. సీపీఎస్, జీపీఎస్ విధానం వలన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకున్న ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాత పింఛను లేకపోవం చాలా విచారకరం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు ఎం.సురేష్‌బాబు, సురేంద్రబాబు, శాంతాదేవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

9న మయానసేవ ఉత్సవం

చిత్తూరు కల్చరల్, మార్చి 5: స్థానిక గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో ఈ నెల 9వతేది మయానసేవ (శ్మశానకొల్ల - దక్ష సంహారం) కార్యక్రమం నీవానది సమీపంలోని శ్మశానంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు బి.కె. కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 8వతేదీ మహాశివరాత్రి సందర్భంగా అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక హోమం, విశేష అలంకారం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. దీంతో పాటు 10వతేదీన అమ్మవారికి సోది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల తనిఖీ

తవణంపల్లె, మార్చి 5: మండలంలోని అరగొండ, తవణంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరీక్షా వసతుల పరిశీలనాధికారి మస్తానయ్య మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షా కేంద్రాల్లో గాలి, వెలుతురు, తాగునీరు ఉండేలా ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులను ట్యాబ్‌ల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి మోహన్‌సింగ్, ఎంఈవో త్యాగరాజులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొగిలికి ప్రత్యేక బస్సు సర్వీసులు

పలమనేరు, మార్చి5 : మహాశివరాత్రి పండుగ సందర్భంగా మొగిలీశ్వరస్వామి వెలసిన మొగిలికి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు పలమనేరు డిపో మేనేజర్ స్వామి తెలిపారు. ఈనెల 8వ తేది పలమనేరు-మొగిలి మధ్య నాలుగు బస్సులు, గుడియాత్రం- మొగిలికి 10 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. పలమనేరు నుంచి మొగిలికి రూ. 20 చొప్పున, గుడియాత్తం నుంచి మొగిలికి రూ. 70 చొప్పున ఛార్జీ వుంటుందని తెలిపారు.

నేడు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

పలమనేరు, మార్చి5 : మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్లను పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు బుధవారం సాయంత్రం ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాముండేశ్వరి, కౌన్సిలర్లు కూడా పాల్గొంటారని తెలిపారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

రామకుప్పం, మార్చి5: చెల్దిగానిపల్లెకు చెందిన రమేష్, అన్నపూర్ణ దంపతులు మంగళవారం తమ కుమార్తె మోహనరూప జన్మదినం సందర్భంగా అన్నక్యాంటీన్ వద్ద ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో కేక్ కట్‌చేయించారు. ఈ సందర్భంగా అన్నక్యాంటీన్‌లో అన్నదానం చేశారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రామకుప్పం, మార్చి 5: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ పేరూరు సమీపంలోని ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తెలిపారు.ఈ నెల 31లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవి.ఇన్,ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, మార్చి5: ననియాలతాండా పంచాయతీ రామాపురానికి చెందిన రామూనాయక్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. టీడీపీ ఎస్సీసెల్ కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజనాయక్, నేతలు సామూనాయక్, కుమార్‌నాయక్, లోకేశ్‌నాయక్, రవినాయక్‌లు రామూనాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

బోయకొండలో సోలార్ ప్లాంట్ ప్రారంభం

చౌడేపల్లె, మార్చి5: బోయకొండలో సోలార్ ప్లాంట్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి, కమిటీ సభ్యులు పవన్‌కుమార్, రజిని, రామదాస్, భారతి, రాజేష్, బుడ్డమ్మ, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ, హైమావతి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రీనరీ పార్కు ప్రారంభం

సదుం, మార్చి5 : సదుంలోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో రూ.22 లక్షల 'చుడా' నిధులతో ఏర్పాటు చేసిన గ్రీనరీ పార్కును మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో 'చుడా' చైర్మన్ పురుషోత్తం రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ వెంకటస్వామి, స్థానిక నాయకులు ఇమ్రాన్, అంజద్, శివారెడ్డి, రమేశ్ రెడ్డి, ఇందాద్, ఇర్ఫాన్, మోహన్ రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రభుత్వ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

కల్లూరు, మార్చి 5: పులిచెర్ల మండలం పాళెంలో చుడా నిధులు రూ:18.50 లక్షలతో నిర్మించిన ఉద్యానవనం, బ్యాడ్మింటన్ కోర్టు ప్రాంగణాన్ని మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం మంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు నాదమునిరెడ్డి, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, ఎంపీటీసీ మంజుల తదితరులు పాల్గొన్నారు. .

మోనూ అమలు తప్పనిసరి

సోమల, మార్చి 5: ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనంలో మోనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో శివరత్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సోమల, అడుసుపల్లె, సూరయ్యగారిపల్లె బడుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పలుసూచనలు చేశారు. విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించి వెనుకబడిన సీ గ్రేడ్ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎల్లయ్య, సుజాత, సీఆర్పీలు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన బీజేపీ నేత



సోమల, మార్చి 5: బీజేపీ రాష్ట్ర నేత పురందేశ్వరిని పుంగనూరు అసెంబ్లీ టిక్కెట్‌ను ఆశిస్తున్న నియోజకవర్గం కన్వీనర్ గన్నా మదన్‌మోహన్ బాబు మంగళవారం విజయవాడలో కలిశారు. గత ఎన్నికల్లో పుంగనూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన వివరాలను, బయోడేటాను పార్టీ నాయకుల దృష్టికి తెచ్చారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమివ్వండి

కుప్పం, మార్చి 5: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని ఆ పార్టీ చిత్తూరు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి తులసీనాథ్ మంగళవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. కుప్పం నుంచి బీజేపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని అభ్యర్థించారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

కుప్పం, మార్చి 5: కుప్పం 2వ వార్డు శీగలపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త కుమార్ కొబ్బరిచెట్టునుంచి పడి కాలికి దెబ్బ తగిలింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం అతనికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ జిటారిమడుగులో బీరప్ప మృతదేహానికి సోమవారం కుప్పం టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న దేవరాజ్ కుమారుడైన ఐదేళ్ల చిన్నారి హార్దిక్‌ను పరామర్శించారు. వైద్య చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

శ్రీశైలం మల్లన్నకు పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న కాణిపాకం ఆలయ చైర్మన్, ఈవో తదితరులు

ఐరాల, మార్చి 5: శ్రీశైల మల్లన్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరపున పట్టు వస్త్రాలను ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు మంగళవారం సమర్పించారు. వారిని మల్లన్న ఆలయ ఛైర్మన్ చక్రవర్తిరెడ్డి, ఈవో పెద్దిరాజు ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఆలయ ఏఈవోలు హరిదాసు, స్వాములు, మోహన్, వరసిద్ధుడి ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సిద్ధార్థ అశోక్‌రాజు



పురందేశ్వరి చేతులమీదుగా బీజేపీ కండువా కప్పుకుంటున్న అశోక్‌రాజు

నగరి, మార్చి 5: నగరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల అధినేత అశోక్‌రాజు మంగళవారం విజయవాడలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అశోక్‌రాజుకు పురందేశ్వరి పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. నరేంద్రమోదీ సిద్ధాంతాలకు ఆకర్షితుడనై బీజేపీ చేరుతున్నట్లు ఆయన తెలిపారు. అశోక్‌రాజు టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకు వ్యక్తిగత సహాయకుడిగా సైతం పనిచేశారు. జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు జగదీశ్వర నాయుడు, జిల్లా ఇన్‌చార్జి రాటకొండ విశ్వనాథ్, మహిళామోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణస్వామి నాయుడు, శ్రీనివాసులు, వెంకటముని, రమేష్ నాయుడు, తులసీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'ఐఎస్ఐ' ఉత్పత్తులనే కొనుగోలు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో ప్రభాకర్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 5: వస్తువుల ప్రామాణీకరణ, మార్కింగ్, నాణ్యత ధ్రువీకరణ కార్యకలాపాలకు ఐఎస్ఐ గుర్తు ప్రామాణికమైనదని, అలాంటి గుర్తు ఉన్న ఉత్పత్తులనే వినియోగదారులు కొనుగోలు చేయాలని జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ సీఈవో ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఐఎస్ఐ గుర్తింపుపై అవగాహన, శిక్షణా తరగతులు జరిగాయి. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఈవో మాట్లాడుతూ ఐఎస్ఐ గుర్తు కలిగిన ఉత్పత్తుల్లో ఎక్కడైనా లోపాలు జరిగితే, వెంటనే ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్సీ కోఆర్డినేటర్ షణ్ముగరామ్, చిత్తూరు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరిలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తను పరామర్శించిన మురళీమోహన్



పూతలపట్టు, మార్చి 5: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తను మంగళవారం పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ పరామర్శించారు. చిత్తూరు నగర సమీపంలోని పంత్రాంపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త లోకనాథం తవణంపల్లె మండలం కాణిపాకపట్నం వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న మురళీమోహన్ చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి లోకనాథంను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను కోరారు. ఆయనతో పాటు బీసీ నాయకుడు పట్నం గోపి ఉన్నారు.

8న శివరాత్రి ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, మార్చి 5: నగరంలోని శివాలయాల్లో ఈనెల 8వ తేదీన శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో సంయుక్తంగా తెలియజేశారు. నీవానది సమీపంలోని కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వరాలయం, కాశీ విశ్వనాథ విశ్వేశ్వరాలయం(రాజుగుడి), కట్టమంచి కుళందేశ్వరాలయం, ఇరువారం నాగేంద్ర, చవటపల్లె కనకదుర్గా, మురుకంబట్టు ఈశ్వరాలయం, ప్రశాంత్‌నగర్ మూకాంబికా, మార్కెట్ శివాలయం, కొంగారెడ్డిపల్లె సిద్ధేశ్వరాలయాల్లో జ్యోతిర్లింగ దర్శనాలు, పూజలు, జాగరణలు, ఉపవాసాలు నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. 9వ తేదీన శివరాత్రి ఉపవాసానంతరం నగరంలోని భక్తులు స్థానిక నీవానది, ఎన్టీఆర్ జలాశయాల్లో స్నానాలు చేసి దీక్షలు విరమించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాల ఆధ్వర్యంలో పార్వతి పరమేశ్వరుల మూలవర్లను నగరంలో పలు ప్రాంతాల్లో ఊరేగించనున్నట్లు వారు పేర్కొన్నారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కట్టమంచిలో ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ హరిణి రెడ్డి ఆధ్వర్యంలో జ్యోతిర్లింగాల ప్రదర్శనలు, ఎస్టేట్, గిరింపేట పగడమాను వీధుల్లో బ్రహ్మా కుమారీస్ ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

గొడుగుచింతలో...

పూతలపట్టు, మార్చి 5: మండలంలోని గొడుగుచింతలో వెలసివున్న ద్రాక్షాయణి నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8వ తేదీన మహాశివరాత్రి వేడుకలను నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.5సీటీఆర్ ఐఆర్ఎల్2: కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో మన ఓటు...మన భవిష్యత్తు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మన ఓటు... మన భవిష్యత్తు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఐరాల(కాణిపాకం), మార్చి 5: కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయులు మన ఓటు... మన భవిష్యత్తు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో పాత పింఛను విధానాన్ని అమలు చేస్తామని ఏ రాజకీయ పార్టీ హామీ ఇస్తుందో ఆ పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. సీపీఎస్, జీపీఎస్ విధానం వలన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకున్న ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాత పింఛను లేకపోవం చాలా విచారకరం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు ఎం.సురేష్‌బాబు, సురేంద్రబాబు, శాంతాదేవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల తనిఖీ



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న మస్తానయ్య

తవణంపల్లె, మార్చి 5: మండలంలోని అరగొండ, తవణంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరీక్షా వసతుల పరిశీలనాధికారి మస్తానయ్య మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షా కేంద్రాల్లో గాలి, వెలుతురు, తాగునీరు ఉండేలా ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులను ట్యాబ్‌ల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి మోహన్‌సింగ్, ఎంఈవో త్యాగరాజులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.38 వేలు



నగదును లెక్కిస్తున్న సిబ్బంది

కార్వేటినగరం, మార్చి 5: కార్వేటినగరం కొమరగిరిపై వెలసిన సుబ్రమణ్య స్వామి ఆలయ హుండీ ద్వారా గత 75 రోజులకుగాను రూ.38 వేలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కృష్ణనాయక్ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పాదాల మండపం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మంత్రి రోజా తదితరులు

నగరి, మార్చి 5: నగరి పట్టణ పరిధిలోని టీఆర్ కండ్రిగలో వెలసియున్న దేశమ్మ (నేత్రప్రదాయణి) దేవాలయంలో నూతన పాదాల మండపానికి మంత్రి రోజా మంగళవారం భూమిపూజ చేశారు. రూ.41లక్షల తుడా నిధులతో నిర్మించిన జగనన్న సమావేశ మందిరాన్ని, రూ.7.25 లక్షలతో నిర్మించిన ఆర్వోప్లాంటును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వేణుబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

చిత్తూరు, మార్చి 5: చుడా పరిధిలో చిత్తూరు నగరంలోని సంతపేట తదితర ప్రాంతాల్లో రూ.5.95 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, నగర మేయర్ అముద, ఆర్టీసీ మాజీ వైస్ ఛైర్మన్ విజయానంద రెడ్డి, డిప్యూటీ మేయర్లు రాజేష్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, చుడా వైస్ ఛైర్మన్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల టీచర్లతో ఆత్మీయ సమావేశం

చిత్తూరు, మార్చి 5: చిత్తూరులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ప్రైవేటు పాఠశాలల టీచర్ల ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి హాజరు కాగా, పలువురు టీచర్లు పాల్గొన్నారు.

పులికల్లులో ఆరోగ్య సురక్ష

పెనుమూరు, మార్చి 5: మండలంలోని పులికల్లు సచివాలయంలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన ప్రజలకు డాక్టర్లు హర్షవర్ధన్, రాజశేఖర్, మీనాసయ్యద్‌లు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. మొత్తం 276 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 39 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

12 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు

యాదమరి, మార్చి 5: కామాక్ష్యాంబాదేవి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 12వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ అమ్మవారు ఒక్కో వాహనంలో భక్తులకు దర్శనమిస్తారని అన్నారు. ఈ నెల 8వ తేదీన మహాశివరాత్రి పండగ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం చేస్తారన్నారు. అదే రోజు రాత్రి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 12వ తేదీన పల్లకి సేవతో మహాశివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

9న మయానసేవ ఉత్సవం

చిత్తూరు కల్చరల్, మార్చి 5: స్థానిక గుర్రప్ప నాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో ఈ నెల 9వతేది మయానసేవ (శ్మశానకొల్ల - దక్ష సంహారం) కార్యక్రమం నీవానది సమీపంలోని శ్మశానంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు బి.కె. కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 8వతేదీ మహాశివరాత్రి సందర్భంగా అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక హోమం, విశేష అలంకారం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. దీంతో పాటు 10వతేదీన అమ్మవారికి సోది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

భూతగాదాలో పలువురికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, మార్చి 5: భూతగాదాలో ఇరువర్గాలు ఘర్షణపడి తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం పుంగనూరు మండలంలో జరిగింది. రాగానిపల్లె పంచాయతీ లక్కుంటకు చెందిన వెంకటరెడ్డి కుమారుడు కృష్ణారెడ్డి, అదేగ్రామానికి చెందిన చెన్నారెడ్డిలు కలసి యూఎస్ఆర్ సర్కిల్‌లో మద్యం సేవించి భూముల విషయంపై గొడవపడ్డారు. దీంతో కృష్ణారెడ్డి కుటుంబసభ్యులైన మురళి, గంగిరెడ్డి కుమారుడు తరుణ్‌కుమార్, గంగిరెడ్డిలను పిలుపించుకున్నట్లు చెన్నారెడ్డి తెలిపారు. వారు తనపై బీరు బాటిల్‌లో దాడిచేయగా గాయపడినట్లు ఆయన చెప్పారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చిత్తూరు కల్చరల్, మార్చి 5: గిరింపేట శివగామి సుందర సమేత చిదంబరేశ్వరాలయంలో గత వారం రోజులుగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న సంగతి విదితమే. బ్రహ్మోత్సవాల్లో మంగళవారం స్వామివారకి రథోత్సవ సేవ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని దుర్గాంబ ఆలయ పాలకమండలి మాజీ ఛైర్మన్ వి.కె. విశ్వనాథ్,గుడిపాల మాజీ మండలాధ్యక్షుడు బాలాజి నాయుడు, వరద, గణేశ్‌రెడ్డిల ఉభయంతో నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మహేశ్ భక్తులకు, ఉభయదారులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రథోత్సవం సందర్భంగా దుర్గాంబ ఆలయం వద్ద ట్రాఫిక్ రద్దీ నెలకొనగా, నగర ట్రాఫిక్ సీఐ నిత్యబాబు ఆధ్వర్యంలో క్రమబద్ధీకరించారు.

రోడ్డుకిరువైపులా ముళ్లకంపలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



బలిజకండ్రిగ రోడ్డుకిరువైపులా పెరిగిన ముళ్ల కంపలు

పాలసముద్రం, మార్చి 5: చిత్తూరు-బలిజకండ్రిగ రోడ్డులో బలిజకండ్రిగ నుంచి పుల్లయ్యగుంట వరకు 13 కి.మీ దూరం సింగిల్ లైన్ తారురోడ్డు ఉంది. రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు ఏపుగా పెరిగిపోవడంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు బస్సులో ఉండే ప్రయాణికులకు ముళ్లకంపలు తగులుతున్నాయి. ఈ సింగిల్ రోడ్డులో ఆర్అండ్‌బీ అధికారులు ముళ్లకంపలు తొలగించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా ఈ రోడ్డు అక్కడక్కడా గుంతలు పడి ఉంది. వాటికి మరమ్మతులు సైతం చేయడం లేదని ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల కంపలను తొలగించి, రోడ్డుకు ప్యాచ్ వర్క్‌లు చేయడమో లేక కొత్త రోడ్డు వేయించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీటికొలను నిర్మాణం పూర్తి చేయరా?



అసంపూర్తిగా ఉన్న నీటి కొలను

కార్వేటినగరం, మార్చి 5: కార్వేటినగరం మండలం ఆర్‌కేవీబీపేట పంచాయతీలో దాదాపు రూ.30 లక్షల వ్యయంతో ప్రారంభించిన నీటికొలను నిర్మాణం సకాలంలో పూర్తి కావడం లేదు గత రెండేళ్లగా ఈ కొలను నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, పనులు పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నీటి కొలను నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ ఎందుకు జాప్యం చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా త్వరగతిన పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చిన్నసుబ్బయ్య యాదవ్ తదితరులు

చిత్తూరు సిటీ, మార్చి 5: ఈనెల 9వ తేదీన గుంటూరులో నిర్వహించే ఛలో అమరావతి వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని వీహెచ్‌పీఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి) రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంపుదల చేయాలని, శారీరక వికలాంగుల రోస్టర్ పాయింట్ 56తో పాటు బధిరుల రోస్టర్ పాయింట్ 31ని 10లోపు కుదించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా వున్న మైదానంలో నిర్వహించే ఛలో అమరావతి వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాగర్జన సభకు వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అనంతరం మహాగర్జన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వికలాంగులందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జయహో బీసీని విజయవంతం చేయండి

గుడిపాల, మార్చి 5: మండలంలోని వసంతాపురం వద్ద గల టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా బుధవారం ఉదయం 10 గంటలకు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించే జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, గుడిపాల మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం వారు మాట్లాడుతూ మండలంలోని బీసీ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నిరుద్యోగులను దగా చేసిన జగన్: జనసేన

కార్వేటినగరం, మార్చి 5: రాష్ట్రంలోని నిరుద్యోగులను సీఎం జగన్ దగా చేశారని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పుల ఊబిలో రాష్ట్రాన్ని ముంచిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందని ఆరోపించారు. వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక అల్లాడిపోతున్నారని, ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాలేదని గుర్తు చేశారు. వచ్చిన పరిశ్రమలు కూడా వెళ్లిపోయే దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.



మంగళగిరిలో మంగళవారం జరిగిన టీడీపీ జయహో రాష్ట్ర బీసీ డిక్లరేషన్ సభలో పాల్గొనేందుకు వెళ్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం స్వర్గీయ ఎన్‌టి రామారావు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని నాయిబ్రాహ్మణ, యాదవ సంఘాల నేతలు

ఎన్నికలకు సన్నద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవిప్రకాష్

పెనుమూరు, మార్చి 5: రాబోవు ఎన్నికలకు టీడీపీ నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ పరిశీలకులు రవిప్రకాష్ సూచించారు. మంగళవారం పెనుమూరు పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జి థామస్‌తో కలిసి ఆయన టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూత్ స్థాయిలో ప్రజలతో మమేకమై ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, నేతలు కార్జాల అరుణ, మనోహర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, తలారి రెడ్డెప్ప, భాస్కర్, యువరాజులు నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కమ్మగుట్టపల్లి గ్రామస్తులు

పూతలపట్టు, మార్చి 5: మండలంలోని అంబేడ్కర్ సర్కిల్‌లోని అన్నక్యాంటీన్ వద్ద మంగళవారం కమ్మగుట్టపల్లి గ్రామస్తులు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు కార్తికేయ చౌదరి, ఈశ్వర్, సోమశేఖర్ నాయుడు, ఏకాంబరం, భాస్కర్, వీరభద్రయ్య, కమ్మగుట్టపల్లి గ్రామస్తులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



ఉపాధి పనులను పరిశీలిస్తున్న సుబ్రమణ్యం

పెనుమూరు మార్చి 5: మండలంలోని గొడుగుమానిపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన పనిదినాలను పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సరాసరి వేతనం రూ.272 తక్కువకాకూడదని ఆయన తెలిపారు. పనులకు సంబంధించిన రికార్డులన్నీ కూడా అప్‌డేట్ చేయాలని అన్నారు. మహేశ్వర్‌రెడ్డి, మీనా కుమారి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బోరు బావుల్లో చోరీకి గురవుతున్న
విద్యుత్ కేబుల్ వైర్లు

- అవస్థలు పడుతున్న రైతులు



విద్యుత్ పోల్ వద్ద కట్ చేసిన కేబుల్

ఐరాల, మార్చి 5: మండల కేంద్రమైన ఐరాలకు కూతవేటు దూరంలోని రెడ్డివారిపల్లె సమీపంలోని వ్యవసాయ భూముల వద్ద ఉన్న బోరు బావుల్లో విద్యుత్ కేబుల్ వైర్లు తరచూ చోరీకి గురవుతున్నాయి. రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి లక్షలాది రూపాయలను ఖర్చు చేసి బోర్లను వేస్తున్నారు. అలాగే నీటిని బయటకు తెప్పించడానికి విద్యుత్‌ను అమర్చడానికి వేలాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అయితే దొంగలు వ్యవసాయ భూముల వద్ద రాత్రి సమయంలో విద్యుత్ వైర్లను దొంగిలించి రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారు. ఈ నెలలో ఇప్పటికే ఐరాల పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు ఐదు చోట్ల చోరీ చేసినట్లు రైతులు సమాచారం ఇచ్చారు. ఇప్పటికైనా పోలీసులు చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సర్పదోష పూజలు



రామకుప్పం, మార్చి 5: పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. రాహుకాలంలో పురోహితులు కృష్ణమూర్తి, నాగరాజుశర్మ పలువురు భక్తులచే సర్పదోష నివారణ పూజలు చేయించారు. ప్రతి మంగళవారం రాహుకాలంలో సర్పదోష నివారణ పూజలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మామిడి తోటకు నిప్పు

పుంగనూరు, మార్చి 5: చౌడేపల్లె మండలం 29ఏ చింతమాకులపల్లె సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటకు నిప్పు పెట్టినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 29 ఏ.చింతమాకులపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డియాదవ్ మామిడి తోటకు నిప్పు పెట్టినట్లు గ్రామస్థుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్లు తెలిపారు.

విద్యార్థినులతో డీఈవో ముఖాముఖి

పలమనేరు, మార్చి 5: పలమనేరు బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థినులతో మంగళవారం డీఈవో దేవరాజు ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఫ్యూచర్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రధాని ఎక్సలెన్స్ అవార్డు కోసం రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు మంగళవారం ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అన్ని పాఠశాలల విద్యార్థినులతో గూగుల్ మీట్ ద్వారా సంభాషించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు కూడా పాల్గొన్నారు. ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం, ప్రధానోపాధ్యాయిని లత, సీఆర్‌పీలు పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఈవో దేవరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు రాబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల విషయంలో విద్యార్థినులు ఒత్తిళ్లకు గురికాకుండా మానసిక స్థైర్యాన్ని నింపాలన్నారు. వెనుకబడిన విద్యార్థినుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

కుప్పం, మార్చి 5: కుప్పం 2వ వార్డు శీగలపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త కుమార్ కొబ్బరిచెట్టునుంచి పడి కాలికి దెబ్బ తగిలింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం అతనికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.